# అందని పిలుపు

రచన:
శ్రీ కె. ఆర్. వరప్రసాదరావు

సిమ్మెంటురోడ్డుమీద రిక్షా సాఫీగా జారిపోతూంది. మల్లెపూల పొట్లాం చేతిలో పట్టుకొని రిక్షాలో వెనక్కు జారగిలబడి కూర్చున్నాడు మహేష్. ఎదురు గాలివలన మల్లెల సువాసన తనకు ఆహ్లాదం కలిగిస్తోంది. తను రాసిన ఉత్తరం అందిందో లేదో? లత ఈపాటికి తన రాకకోసం కళ్లు కాయలుకాచేలా ఎదురుచూస్తూ వుంటుంది. పాపం, తనంటే లతకెంత ప్రేమో! చేరవలసిన చోటు దగ్గరౌతున్నకొద్దీ మనసులో ఆవేదన అధికమౌతోంది మహేష్‌కు.

× × ×

జానకిరామయ్య, సుశీలమ్మగార్ల ఏకైకపుత్రుడు మహేష్. పెద్దలవల్ల సంక్రమించినది తక్కువైనా తన సమర్థతతో ఆస్తిని అభివృద్ధి చేశారు జానకిరామయ్యగారు. గ్రామంలో మంచి వ్యక్తిగా పలుకుబడి సంపాదించి పంచాయితీబోర్డు ప్రెసిడెంటుగా ఎన్నికైనారు. జానకిరామయ్యగారి వేలు విడిచిన చెల్లెలు కుమార్తె లత. లతను, మహేష్‌కు వివాహం జరిపించి తమ బంధుత్వాన్ని పెంపొందింపజేయమని జానకిరామయ్యగారి దగ్గర, భర్త దగ్గర వాగ్దానంపొంది కన్ను మూసింది లత తల్లి.

క్రిందటిసారి శెలవుల్లో యింటికి వచ్చానని తెలియగానే ఎంతో ఆత్రంగా తన్ను చూడ్డానికి వచ్చింది లత. ఆరోజు సాయంత్రం యిద్దరూ షికారుగా వూరివెలుపలి చెరువుదగ్గరకు వెళ్లారు. చెరువుగట్టుకు రెండువేపులా ఎత్తుగా పెరిగిన కొబ్బరిచెట్లున్నాయి. వానినుండి చల్లని గాలి వీస్తోంది.

మహేష్ గట్టున ఒక మూలగా కూర్చున్నాడు. కొంచెం దూరంగా నిల్చొని అతని వంకే చూస్తోంది లత. వృద్ధ భానుడు పశ్చిమదిశ కొండల మాటుకు మెల్ల మెల్లగా జారుకొంటున్నాడు. అంతవరకూ తమంత అందంగా యెవ్వరూ లేరని విర్రవీగిన కొలనులోని కమలములు ఎందుకో ముడుచుకో నారంభిస్తున్నాయి. తామర ఆకులపై నీటి బిందువులు మంచిముత్యాల్లా మెరుస్తూ గాలికి అటు యిటు కదులాడుతున్నాయి. నీటి బాతుల జంట ఒకటి తనవేపే వస్తోంది. కనుచూపు మేర అంతా వరిపొలం పచ్చగా చేల యీనినట్లు కనబడుతోంది. ఆకసంలో కొంగల గుంపొకటి ఎగిరిపోతూ కొన్ని క్షణాల్లో కనుమరుగయాయి. ఈ ప్రకృతినంతా చూసి మహేష్ చెప్పలేని అనుభూతి, ఆనందం పొందుతున్నాడు. నెమ్మదిగా అతని దగ్గరకువచ్చి కూర్చుంది లత.

'బావా' నెమ్మదిగా పిలిచింది ఆమె.

అంతవరకూ ప్రకృతిని చూస్తూ మైమరచిన మహేష్ ఆ పిలుపుతో ఆమె వంక ఏం అన్నట్లు చూశాడు. జవాబు రాలేదు.

'లతా! ఎంత అందంగా వున్నావు' కొద్దిసేపు తేరపార చూసి అన్నాడు

'ఎంత అందంగా వున్నానో?' ప్రశ్నించిందామె.

'గాలికి కదిలే ఆ నల్లని ముంగురులు, నొసటను తీర్చిదిద్దిన ఆ కుంకుమ బొట్టు, కలువరేకుల్లాంటి కళ్లు.'

'ఆపాలి బావా, నీ కవిత్వం! ఎవరైనా వింటే నీకు పిచ్చెక్కిందనుకుంటారు' మధ్యలో అందుకుంది లత.

'అనుకోనీ! ప్రేమ పిచ్చి అనుకుంటారు అంతేగా. ఇదుగో లతా! నీవు నాదానవు కాకపోతే నిజంగా నేను పిచ్చివాడనౌతానేమో.' రెండు చేతులతో లతను తన ఒడిలోనికి లాక్కున్నాడు. ఆమె నెమ్మదిగా విడిపించుకొని కొంచెం దూరంగా జరిగి కూర్చుంది.

'అబ్బాయిగారి జోరు కొంచెం తగ్గించాలి. ఈ సంవత్సరం ఫస్టుక్లాస్‌లో పాస్ కావాలి తరువాత పెద్దలంతరి ముందర......'

'మూడుముళ్లూ వెయ్యాలి, అదేగా నీ కోరిక' చిరునవ్వుతో పలికాడు మహేష్. ఆ మాటలకు సిగ్గుతో తల వంచుకుంది ఆమె. కొద్ది క్షణాలు మౌనం విహారం చేసింది యిద్దరి మధ్యా.

'బావా!' చేతి వేలితో నేలను గీస్తూ పిలిచింది.

'ఊఁ' తదేకంగా చూస్తూ దగ్గరకు జరిగాడు.

'నాకేదో భయంగా వుంది.'

'కారణమేమిటో' ముఖం చిన్నబోయిందతనికి.

'మన వివాహం......'

'ఊఁ, మన వివాహం?'

‘ఊహూ, అదికాదు బావా! రాబోయే ఎలక్షన్‌లో మామయ్యకు వ్యతిరేకంగా మా నాన్నను నిలబెట్టి మనలో మనకు కక్షలు రేపి మన బంధుత్వం విడగొట్టడానికి చూస్తున్నారు కొందరు పెద్దమనుషులు.’

‘దైవం కాపాడితే యెవ్వరూ మన యిద్దరినీ వేరు చెయ్యలేరు’ లతని నెమ్మదిగా మళ్లీ తన ఒడిలోనికి తీసుకున్నాడు మహేష్. ఇద్దరి మధ్యా సంభాషణ నిలిచింది. మెల్ల మెల్లగా లోకానంతటినీ తనలో ఐక్యం చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది చీకటి. అప్పటివరకూ ప్రకృతికి శోభనిచ్చిన వస్తువులన్నీ యిపుడు వికృతరూపాలు దాలుస్తూ భయంకరంగా తయారౌతున్నాయి. అంతవరకూ గగనంలో విహారంచేసిన పక్షులు తమగూళ్ళకు చేరుకొంటున్నాయి.

‘చీకటి పడుతుంతోంది, యింటికి వెళదాం బావ’ ఒడిలోంచి లేస్తూ పలికింది లత. ఇద్దరూ మౌనంగా వాడిచారు,

శెలవులు పూర్తికాగానే తను పట్నంవెళ్లి పోయాడు.

× × ×

రిక్షాకుదుపుతో మహేష్ ఆలోచనలకు అంతరాయం కలిగింది. చేతిలో పూలను మరొక్కసారి వాసన పీల్చి తనలో తనే నవ్వుకున్నాడు. మరుక్షణం అతివేగంగా రిక్షాను తాకుతూ పోయిందొక బస్సు.

‘ఈ పొద్దులేత్తుండగా మీరు మంచోరి మొకం చూసేరు, లేకుంటే యీపాటికి మన ప్రాణాలు యీ కట్టెల్ని వదిలేసివుండేవి’ అంచున నడుస్తున్న రిక్షాను సరిగ్గా తీస్తూ అన్నాడు రిక్షా డ్రైవరు కన్నయ్య.

‘కొంచెంలో తప్పింది, రిక్షా బోల్తా పడ్డానికి’ వెనుకకు చూస్తూ తనలో అనుకొన్నాడు. ఫర్లాంగు దూరంవరకూ పరుగులుతీసాయి రిక్షాచక్రాలు. రెండు నిమిషాలు నెమ్మదిగా వెళ్ళిన తరువాత రిక్షాను పక్కకు తీసి ఆపాడు కన్నయ్య. రిక్షాదిగి రూపాయినోటు తీసిచ్చాడు మహేష్. కాగితాన్ని దీపంవెలుతురులో చూచి ‘చినబాబుగారూ! చిల్లరడబ్బులు.........’ నసిగాడు కన్నయ్య.

‘అక్కర్లేదులే, ఉంచుకో’.

సంతోషంతో జేబులో పెట్టుకున్నాడు.

‘వస్తాను కన్నయ్యా’

‘చినబాబుగారూ! చీకటి రాత్రులు, బండిని పక్కన పెట్టి అంతవరకూ రమ్మంటేవత్తాను’ తుండుగుడ్డతో ముఖాన్నిపట్టిన చెమటను తుడుచుకుంటూ అన్నాడు.

‘భయంలేదు కన్నయ్యా, వెళ్ళగలను’.

‘మరేమీలేదు బాబూ, తమరు జడుసుకుంటారేమోనని’.

‘ఫరవాలేదులే’

‘తమరియిట్టం’ నీరసంగా పలికి రిక్షాను తీసుకుపోయాడు కన్నయ్య. అక్కడనుండి మైలున్నర నడవాలి. ఒక చేతిలో పూలపొట్లాం, రెండవచేతిలో సూట్‌కేస్ పట్టుకొని ముందుకు నడుస్తున్నాడు మహేష్. మబ్బులు కమ్మడంతేత అమావాస్య రాత్రి మించినట్లుంది చీకటి. అయినా వుత్సాహంగా కళ్లుపెద్దవి చేసుకొని బాటను గుర్తుపట్టుకుంటూ నడుస్తున్నాడు. అతనికి రిక్షా కన్నయ్యపై జాలివేసింది. అతడూ ముందట తన వూరివాడే. ముసలి తలిదండ్రులు, భార్యాపిల్లల పోషణ భారమంతా తన నెత్తిమీద పడడంతో పల్లెటూళ్లో వచ్చే కూలి డబ్బులు చాలకపోవడంతో రిక్షా లాగడం మొదలు పెట్టాడు. కాలికి ఏదో తగిలింది. రాయి. బూటులేకుంటే నెత్తురు వచ్చుననుకుంటూ మళ్లీ నడక సాగించాడు మహేష్. తనువేగంగా యింటికి చేరాలి. లతతో కులాసాగా గడపాలి. ఇవే ఆలోచనలతో ఫర్లాంగుదూరం నడిచే సరికి తృళ్లిపడినంతపనైంది. ఏదో ఆకారం తనముందు నడుస్తూంది. అడుగులవేగాన్ని హెచ్చించి ఆ మనిషిని చేరుకొన్నాడు. ఇంకెవరు, లతే, తన లతే. ఆశ్చర్యాన్ని మనసులో దాచుకొని నెమ్మదిగా ‘లతా’ అనిపిలిచాడు. ఆ ఆకారం మామూలుగానే నడుస్తుంది. ‘ఎవరు మీరు’ తనే మొదట పలకదించాడు అనుమానం తీరడంకోసం. ఆమె జవాబియ్యలేదు. మునుపటికన్నా తొందరగా నడవడం మొదలు పెట్టింది. తిరిగి అదే మాట అడిగాడు మహేష్. ‘నేను. జానకిరామయ్యగారి మేనకోడలిని’ తడబడుతున్నమాటలతో నసుగుతూ జవాబిచ్చిందామె. ‘లతా, నేను నీ బావను’ అన్నాడు. ఆమె నమ్మలేదు. ‘నిజమే లతా, నీ మహేష్‌ను’, ఈసారి ఆమె పక్కకు చూస్తూ ‘నువ్వా బావా, ఎవరో ననుకున్నాను’ జవాబిచ్చింది ఆశ్చ

(తరువాయి 17వ పేజీలో)

నవ్వు నవ్వితే, ఇటు ఈ పెనిమిటి లోలోన ఉబికి వచ్చే ఆనందాన్ని పురస్కరించుకొని హాయిగా నవ్వుతాడు. దైనందిన జీవితంలో మనిషి అన్నవాడు ఆనందంగా తద్వారా ఆరోగ్యంగా ఉండాలంటే అతడు అప్పుడప్పుడైనా నవ్వటం అత్యవసరం. అంటే అతడు 'వెండి గిన్నెలోని పంచదార పాయసాన్ని జుర్రే విధంగా హాస్యరసాన్ని ఆస్వాదించే అవకాశాల కోసం అనుక్షణం ఎదురు చూస్తుండాలన్నమాట. తోలు బొమ్మలాటలో బంగారక్క, జుట్టుపోలిగాళ్లను చూచినపుడో, బుర్రకథలో ఉపనాయకుల సంభాషణలను విన్నపుడో, సర్కస్‌లో బఫూన్లను చూచినపుడో, హరికథలో పిట్టకథలను విన్నపుడో, నాటకాల్లో విదూషకులు, సినిమాల్లో హాస్యపాత్రధారుల చేష్టలు' మాటలు, కని, విని ఆనందించి నవ్వాల్సుంటుంది: నవ్వుతారు. అంతేకాని ఎంతటి హాస్యానికైనా నవ్వకుండా ఉండటమనేది 'పంజరంలో పక్షిలా' హృదయాన్ని చీకటి గోళంలో బంధించినట్లవుతుంది. పూర్తిగా నవ్వకపోవటం మాట అటుంచి, ఆలస్యంగా నవ్వటమూ అపరాధమే; అపరాధం కాదంటే అందులో అంత అంత ఆనందం మాత్రం అందదు. విశ్వవిఖ్యాతి గాంచిన ఆంగ్ల నాటక కర్త విలియం షేక్స్పియర్ విరచితమైన 'వెన్నిస్ వర్తకుడు' అన్న నాటకంలో ఒక చిన్న(మగ) పాత్ర ఉంది. ఒక హాస్య సంఘటనకు ప్రతిక్రియగా ఆ పాత్ర కొన్ని నెలల తరువాత నవ్వుతుంది. ఎప్పుడో జరిగిందే హాస్య సంఘటనను తలచుకొని ఆ పాత్ర కొన్ని నెలల తర్వాత నవ్వటం అల్లా ఉండగా, ఆ విషయం వినే అనేకులకు మటుకు నవ్వు రాకమానదు.

నవ్వు రకరకాలుగా పుట్టుకొస్తుంది. వాటిల్లో పలు రకరకాల భావాలు ప్రతిబింబితాలవుతుంటాయి. ఐతే సమయా సందర్భాలను బట్టి విరబూసే అదే నవ్వు, కోపాన్ని, తాపాన్ని బట్టి వూసిపోతుంది, వూసిన పూవు వాడి పోయేలా, క్రొవ్విరిలా అగుపించే ఆ నవ్వు ఎల్లప్పుడూ క్రొత్తకాంతితోనే తళతళలాడుతోంటే ఆ నవ్వుకు అర్థముండదు. అంటే అడపాదడపా ఆ నవ్వు వాడిపోవాలి. అలగాని...రోజూ వెన్నెల విరబూస్తే అదేం అందమా? అప్పుడా వెన్నెల అందమూ అణగారిపోతుంది. దాని పరపతి పడిపోతుంది. దాని ఘనతకూ విలువలేకుండా పోతుంది. వెన్నెల...చీకటి...వెన్నెల...అల్లా ఉండే దాని ప్రత్యేకత వేరు: అల్లాగే నవ్వు...ఏడుపు...నవ్వు: అదీ నిజమైన సూక్తి: అప్పుడే మనకు రక్తి...ప్రాణికీ భుక్తి...అదే జీవితానికి ముక్తి.

(18వ పేజీ తరువాయి)

ర్యంతో. ఇంతరాత్రివేళ ఒంటరిగా ఎక్కడినుండివస్తున్నావని అడిగాడు మహేష్.

'పదిరోజుల క్రితం పిన్నిగారింటికి వెళ్ళాను బావా. నీవు వస్తున్నట్టు వుత్తరం రాసావటగా! ఆ కబురు నాకు యీ వేళ తెలిసింది. నిన్ను యిన్నాళ్ళుగా చూడకుండా వుండలేకపోతున్నాను. నీవు తప్పకుండా వచ్చివుంటావని, నాకోసం ఎదురుచూస్తావన్న నమ్మకంతో మధ్యాహ్నమే బస్సెక్కాను. మధ్యలో బస్సు చెడిపోయింది. దానిని రిపేరు చేసేసరికి చీకటిపడింది.'

పావుగంట క్రితం రిక్షాను తాకుతూ పోయిన బస్సు జ్ఞాపకం వచ్చింద తనకి. 'లతా, ఈ చీకటిలో నడవడం నాకే భయంగా వుంది.'

'భయం ఎందుకు బావా, పల్లెటూళ్లో మసలేవాళ్లం.'

జేబులో చెయ్యి పెట్టబోయాడు మహేష్. పొట్లాం అడ్డం వచ్చింది. 'నీకోసం ఏవిఁటి తెస్తున్నానో తెలుసా లతా' అన్నాడు.

'ఏమిటది?' ప్రశ్నించిందామె.

'వాసన చూస్తే నీకే తెలుస్తుంది' పొట్లాంను లత ముక్కుదగ్గర పెట్టాడు. ఆమె వాసన చూసింది. పూలు ఆమె చేతికివ్వబోయాడు.

'పువ్వులెవరూ చేతికివ్వరు.'

మహేష్ గ్రహించాడు లత భావాన్ని, లత నిలుచుంది. ఆమె సిగలో పూలు ముడిచాడు. ఇద్దరూ నడక ప్రారంభించారు. నీలాకాశంలో నక్షత్రాలు మిణుకు మిణుకుమని ప్రకాశిస్తున్నాయి. బాటకు రెండువేపులా చెఱకు తోటలు బలిసున్నాయి. దూరాన ఎక్కడో నక్కలు కూస్తున్నాయి. చెఱువుగట్టెక్కారు యిద్దరూ. అది దాటితే వూరు చేరినట్టే.

'బావా! ఇక్కడ కొంచెంసేపు కూర్చుని వెళదామా?' అడుగులు చిన్నవిచేస్తూ అడిగింది.

'ఏం అలిసిపోయావా?' వెటకారంగా భావించాడు లత మాటల్ని మహేష్.

'వెటకారంకాదు బావా, ఐదు నిమిషాలు యీ చల్లగాలిలో కూర్చుందామనివుంది' మనసులోని భావాన్ని పైకి వెలిబుచ్చుతూ అతడి భుజాలమీద రెండు చేతులూ వేసింది.

'ఇపుడు పూర్తిగా నీకు మతిపోయి నట్టుంది. ఓపిగ్గా రెండడుగులు ముందుకు వేస్తే మనయిల్లే చేరుకుంటాం'

అక్కడ ఐదు నిమిషాలు కాదు అయిదేళ్ళు కూర్చున్నా నిన్నెవరూ అడిగేవారు లేరు.'

'ఇకముందుకు నడవలేను బావా' ఆగిపోయింది లత. అతన్ని ముందుకు వెళ్లనివ్వలేదు. ఆమె భావాలను అర్థం చేసుకోలేకపోతున్నాడు. మనసులో ఆలోచించడం మొదలుపెట్టాడు. లత పూర్తిగా మారిపోయినట్లనిపిస్తుందతనికి. 'లతా! నీవు పూర్తిగా మారిపోయావనిపిస్తోంది నాకు' హృదయంలోని భావాన్ని దాచుకోలేక అడిగేశాడు.

'నన్ను అర్థం చేసుకోలేకపోతున్నావు బావా! నీవింకా మన పరిస్థితులను గ్రహించలేదు.'

'కొద్దిరోజుల్లో నీకు మూడు ముళ్ళు వేసి నిన్ను పూర్తిగా అర్థం చేసుకుంటానుగా'

నీరసంగా నవ్వింది లత. ఆమె నడుంచుట్టూ చేతులు పోనిచ్చి ముందుకు నడిపించడానికి ప్రయత్నిస్తున్నాడతడు. భారంగా అడుగులు పడుతున్నాయి. యిద్దరకూ ఎదురుగా ఎవరో వస్తున్నారు. వాళ్ళ చేతుల్లో లాంతర్లున్నాయి. మహేష్‌ను ముందుకు పోనివ్వక ఆపడానికి విశ్వప్రయత్నం చేసిందామె. కాని లాభం లేకపోయింది. ఇద్దరూ చెఱువుగట్టు దిగుతున్నారు. వెనుక ఏదో బలంగా లాగినట్లనిపించిందతనికి. బలంగా అడుగులు వేస్తున్నాడు. మైకం కమ్మి కళ్ళు మూతలు పడుతున్నాయి. స్పృహ తప్పుతున్నట్లనిపిస్తుందతనికి, డికాలు జారి క్రిందికి దొర్లాడు మహేష్.

× × ×

భానుని లేతకిరణాలు కిటికీగుండా ముఖంమీద పడుతూంటే నెమ్మదిగా లేచాడు మహేష్. శరీరమంతా నొప్పిగా వుంది. రెండు మోచేతులకు గాయాలు తగిలాయి. కాళ్ళకు అక్కడక్కడ గంట్లున్నాయి. అవెలా తగిలాయో అతడికి అర్థం కాలేదు. మెల్లగా లేచి మేడ దిగాడు. సుశీలమ్మ వంటగదిలో కాఫీ తయారుచేస్తోంది. అతని కళ్లు ఎవరినో వెదుకుతున్నాయి. చుట్టూ కలియజూసాడు. బరువుగా నిట్టూర్పువిడిచి వీధిగుమ్మంలోకి వచ్చాడు. నౌకరు రంగయ్య వాకిట్లో కూర్చున్నవాడల్లా అతడ్ని చూసి లేచి నించున్నాడు.

'ఎక్కడికి బాబూ, ఇలావస్తున్నారు?'

'మామయ్య యింటికి వెళ్దామని'

'అదేంటి బాబూ, రెండురోజులనుండి తమకు స్పృహ లేదు. కొద్ది సేపట్లో అత్తమ్మగారే మనయింటికి వస్తారులే బాబూ' బైటకు వెళ్ళకుండా ఆపడానికి ప్రయత్నించాడు రంగయ్య. తూలుతున్న శరీరాన్ని అదుపులో తెచ్చుకుంటూ అడుగుముందుకు వేస్తున్నాడు మహేష్,

'వద్దు బాబూ! అత్తమ్మగారియింటికి యిపుడు వెళ్ళొద్దు. ఎలాగూ వెళ్ళేలాగున్నాడని తప్పని సరిగా అన్నాడు రంగయ్య.

'ఏం?' బరువుగా అడిగాడు.

'వారు మనతో మాట్లాడరు బాబూ'

'అబద్ధం! లత నన్ను చూడకుండా ఒక క్షణంకూడా వుండలేదు. రాత్రి యిద్దరం కలిసే వచ్చాంగా. ఇంత వరకూ ఇక్కడే వుందనుకున్నాను' అతని ముఖం గంభీరంగా తయారయింది. అతడు యింటికి చేరి రెండురోజులైనా నిన్ననే వచ్చినట్టుగా భావిస్తున్నాడు స్పృహ తప్పడం వలన.

'నిజమే బాబూ! ఇక తమ్మగారు మనయింటికి రారు.' కంటినిండా నీరు నిలిచింది.

'రంగయ్యా! ఏమిటి జరిగిందో వేగంగా చెప్పు. నన్ను బాధపెట్టకు' అతని రెండు చేతులూ పట్టుకొని ఆత్రంగా అడిగాడు,

'మొన్న జరిగిన ఎలక్షనులో పెదబాబుగారికి వ్యతిరేకంగా మామయ్యగారు నించున్నారు. పోటీలో పెదబాబుగారు నెగ్గారు. దానితో వారికి కోపం ఎక్కువయి అత్తమ్మగారికి మరోసంబంధంచూచి ప్రదానం జరిపారు. రెండుదినాల్లో పెళ్ళనగా అత్తమ్మగారు...' చెప్పలేకపోయాడు రంగయ్య.

'తరువాత లత, లత ఏమయింది? ఇపుడు కులాసాగా వుందా?' ఆవేశంతో బలవంతంచేసి అడిగాడు.

'తమతో పెళ్ళి జరగలేదని అత్తమ్మగారు నూతులో పడి.........సచ్చిపోనారు' కన్నీరు ధారగా నేలరాలుతోంది. కంఠం బొంగురుపోయింది.

'అయితే నిన్న రాత్రి నాతో వచ్చింది...' మాట పూర్తి చేయలేకపోయాడు మహేష్. తెల్లని చీర, మాటతీరు, నడక, అన్నీ ఒక్కొక్కటే జ్ఞాపకం వస్తున్నాయి. హృదయంలో అగ్నిపర్వతం బ్రద్దలయింది. ప్రపంచమంతా జలమయమయినట్లనిపించింది. కాళ్ళలో పటుత్వం నశించింది. కుప్పగా నేలకూలాడు మహేష్. 'చినబాబూ' అంటూ గట్టిగా అరుస్తూ దగ్గరకు చేరాడు రంగయ్య. వంటగదిలోనుంచి సుశీలమ్మ పరుగెత్తుకుంటూ వచ్చింది. 'బాబూ, బాబూ'అని పిలిచింది. తల్లివంక కాసేపు చూసి కళ్ళు మూసాడు. అవే ఆఖరి చూపులుగా బోలు. 'బాబూ, బాబూ' అంటూ యింకా పిలుస్తూనే వుంది సుశీలమ్మ. అప్పటికే బాబు ప్రాణం అనంత వాయువుల్లో లీనమైపోయింది. తనకు తల్లి కడసారి పిలుపులు అందలేదు. ఆకసంలో తీతిక అరుచుకుంటూ ఎగిరిపోయింది.